క్లుప్తంగా

చురుగ్గా మండపం నిర్మాణ పనులు



గాలాయగూడెంలో ఆలయం ఎదుట రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న మండపం

దెందులూరు: గాలాయగూడెంలోని అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఉన్న నాగాశ్వని అమ్మవారి ఆలయం ఎదుట ఆలయ చైర్మన్, పూజారి అన్నవరం రూ. 10 లక్షలతో మండపాన్ని నిర్మిస్తున్నారు. ఏటా వైభవంగా నాగాశ్వని అమ్మవారి ఉత్సవాలు మూడు రోజులు పాటు నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మండపం నిర్మిస్తున్నట్టు చైర్మన్ వివరించారు.

నేడు వైఎస్సార్ ఆసరా

గణపవరం: ఈనెల 2వతేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గణపవరం మండలం పిప్పరలో వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తెలిపింది. పిప్పర, మొయ్యేరు, డి.కుముదవల్లి, కోమర్రు, ముప్పర్తిపాడు, వెంకట్రాజపురం, కేశవరం, కొండేపాడు, అప్పనపేట, జల్లికాకినాడ, ఏగోపవరం, ముగ్గుళ్ల, వీరేశ్వరపురం, చిలకంపాడు, కాశిపాడు, కోమట్లపాలెం గ్రామాలకు చెందిన స్వయం సహాయక సంఘాలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చెక్కులు పంపిణీ చేస్తారని, ఆయా గ్రామాల డ్వాక్రా సంఘాలు, పార్టీ నాయకులు ఈకార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

చెరువులో రోడ్డు నిర్మాణ పనులు నిలుపుదల



గాలాయగూడెంలో చెరువులో రోడ్డు నిర్మాణ పనులను నిలుపుదల చేసిన అధికారులు

దెందులూరు: గాలాయగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ వెనుక ఉన్న చెరువులో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా అర్ధరాత్రి వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఇరిగేషన్ డీఈ అర్జున్, దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య నిలుపుదల చేశారు. రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్న వ్యక్తిని చెరువు వద్దకు పిలిపించారు. కౌన్సెలింగ్ చేశారు. జేసీబీతో తవ్విన మట్టిని యథాస్థానంలో వేయించారు. మరోసారి ఇలాంటి చర్యలు చేపడితే జేసీబీ సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాంచారయ్య, డీఈ అర్జున్ అన్నారు.

విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలు



భీమడోలులో పదో తరగతి విద్యార్థులను పెన్నులను అందిస్తున్న జెడ్పీటీసీ

భీమడోలు: విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 3 నుంచి పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న 170 మంది విద్యార్థులకు శనివారం జెడ్పీటీసీ ఆర్థిక సాయంతో పెన్నులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఓ మైలు రాయి అన్నారు. పట్టుదలలో చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను అందించారు. హెచ్ఎం పుష్పావతి, టీచర్లు పాల్గొన్నారు.

స్థలాలు కేటాయించేందుకు లే అవుట్లు సిద్ధం

ఉంగుటూరు: నారాయణపురంలో 228 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రెండు లే అవుట్లు సిద్ధం చేశామని ఉంగుటూరు తహసీల్దారు వెంకటరమణ వెల్లడించారు. ఒక లే అవుట్‌లో 103 మంది లబ్ధిదారులకు రూ.69 లక్షల వ్యయంతో పూడిక పనులు పూర్తి చేసి ప్లాట్లు సిద్ధం చేశామని తెలిపారు. రెండో లేఅవుట్‌లోని చెట్లు తొలగించి 125 మంది లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వడానికి రంగం సిద్ధమైందని వెంకటరమణ వివరించారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

పెదవేగి : మండల వ్యాప్తంగా అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ చెప్పారు. పెదవేగి మండలం విజయరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను ఎంపీడీఓ శనివారం పరిశీలించారు. వంగూరులోని ఏర్పాటు చేసిన రెండు జగనన్న లే అవుట్లను పరిశీలించి, ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. లే అవుట్‌లో విద్యుత్ స్తంభం ఏర్పాటుపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో సంబంధిత విద్యుత్‌శాఖ ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.

ఆసరాతో అక్కాచెల్లెమ్మల కుటుంబాల్లో వెలుగు

భీమడోలు: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా అక్కాచెల్లెమ్మలకు జీవితాల్లో వెలుగు నింపుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు ఎంపీడీవో ప్రాంగణంలో శనివారం భీమడోలు, పోలసానిపల్లి, సూరప్పగూడెం, అంబర్‌పేట గ్రామాలకు చెందిన 552 డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకానికి సంబంధించిన రూ.5,14,33,362 చెక్కులను ఎమ్మెల్యే వాసుబాబు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వాసుబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం వైఎస్ జగన్ అమలు చేశారన్నారు. ఎన్నికల సమయానికి డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని చెప్పి నేటికి మూడు విడతలు నిధులను మంజూరు చేశారని అన్నారు. అక్కా చెల్లెమ్మలకు అండగా నిలిచిన జగనన్నకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలన్నారు. అనంతరం మహిళలు సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేసారు.

భీమడోలులో బీసీ కాలనీలో నీటి ఎద్దడి నివారణలో భాగంగా పంచాయతీ నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న నూతన బోరుకు ఎమ్మెల్యే వాసుబాబు శంఖుస్థాపన చేసారు. పంచాయతీలోని చెత్త తరలించేందుకు రూ.9.5లక్షలతో కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను వాసుబాబు ప్రారంభించారు. ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ,



భీమడోలులో జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు, చిత్రంలో ఎమ్మెల్యే వాసుబాబు

సర్పంచులు షేక్ రహీమాబేగం హసేనా, నీలం శ్రీనివాసరావు, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్య శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, ఎంపీటీసీలు ఇంజేటి జూనియర్, గంటా శ్రీనివాసరావు, అంబటి దేవి ప్రసాద్, ఆజామ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఉంగుటూరు: ప్రతి మహిళను లక్షాధికారి చేయాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం ఉంగుటూరులో పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో ఆసరా మూడో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా



ఉంగుటూరులో ఆసరా పథకం చెక్కును మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

ఏర్పాటు చేసిన సభలో వాసుబాబు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు అండగా ఉన్నానంటూ వారి రుణాలను నాలుగు దఫాలుగా మాఫీ చేసి మాట నెలబెట్టుకున్న గొప్ప వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అని అన్నారు. మహిళలకు, బడుగు, బలహీన వర్గాలకు పదవులు, రాజకీయ అవకాశాలు కల్పించిన గొప్ప నాయకుడు జగన్ అన్నారు. సమావేశంలో వైసీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి పుప్పాల గోపి, ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, మహిళా అధ్యక్షురాలు మంద జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, వీవర్స్ సొసైటీ అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, ఏపీఎం పద్మావతి, ఎంపీటీసీ సందక రాంబాబు, సర్పంచి బండారు సింధు, బాదంపూడి సర్పంచి కంకట పద్మలీల మాట్లాడారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, తహసీల్దారు వెంకటరమణ, దొంతవరం, కాగుపాడు, వెల్లమిల్లి, నీలాద్రిపురం, నాచుగుంట , కాకర్లమూడి, వీపీపురం గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. సీఎం చిత్రపటానికి ఎమ్మెల్యే సమక్షంలో మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు. ముందుగా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వాసుబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 654 డ్వాక్రా సంఘాలకు చెందిన 6,486 మంది మహిళలకు రూ.5.20 కోట్ల విలువైన చెక్కులను ఆయాగ్రామాల డ్వాక్రా సంఘాలకు వాసుబాబు పంపిణీ చేశారు.

పాఠశాల వార్షికోత్సవంలో చిన్నారుల సందడి



అన్నేవారిగూడెంలో ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలలు చిన్నారులు బంగారు భవిష్యత్తుకు సోపానాలని మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో 65వ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను చూపరులను ఆకట్టుకున్నాయి. హెచ్ఎం ఎస్‌కే మస్తాన్ మాట్లాడుతూ నాడు- నేడు పథకంలో లక్షలాది రూపాయల నిధులతో కొత్త భవనాలు, అదనపు తరగతి గదుల నిర్మించినట్టు తెలిపారు. మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, విద్యా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలం శ్రీనివాసరావు, ఎంపీటీసీ పి.శ్రీనివాస్, మాజీ ఎంపీపీ నెక్కలపూడి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ అన్నేం వీరరాఘవులు, పెద్దలు, టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

పథకాల అమలులో సచివాలయ ఉద్యోగులదే కీలక పాత్ర

పెదపాడు: గ్రామాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేయడంతో సచివాలయ ఉద్యోగులదే కీలక పాత్ర అని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని కలపర్రులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా వారికి అందిన లబ్ధిని వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ అభివృద్ధి చేయాలని, రైతు భరోసా రాలేదని, ఇంటి రుణం ఇవ్వలేదని, రేషన్ కార్డు ఉన్నా ఆన్‌లైన్‌లో పింఛను నమోదు చేయలేదని, అన్నపూర్ణ రేషన్ కార్డుకు బియ్యం రావడం లేదని, రేషన్ కార్డు పునరుద్ధరించాలని కోరారు. వెంటనే సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఎల్లో మీడియా వాస్తవాలు చెప్పకుండా అబద్ధాలు వడ్డి వార్చి ప్రజలను మభ్యపెడుతున్నాయని ఈ విషయాన్ని అందరికీ వివరించాల్సిన



కలపర్రులో ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పారదర్శకంగా ప్రభుత్వం నేరుగా ప్రజలకు సంక్షేమ పథకాలు చేరాలనే ఉద్దేశ్యంతోనే సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని అన్నారు. ప్రస్తుతం మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో ప్రజల వద్దకు వెళ్తున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, ఎంపీటీసీ కంభాల నాగరాజు, సర్పంచ్ వట్రపు విష్ణుతులసి కోటిరెడ్డి, కొక్కిరపాడు ఎంపీటీసీ వీరంకి బుజ్జి, సాధం కిశోర్, చిన్నం వెంకటేశ్వరరావు, కొండే లాజరు, పోలిమెట్ల రమేష్, ఈఓ మేకా శ్రీనివాస్, ఏపీఎం దాసరి సుమలత, ఏఓ ప్రదీప్‌కుమార్ హౌసింగ్ ఏఈ చైతన్య పాల్గొన్నారు.

హోరాహోరీగా జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ క్రికెట్ పోటీలు

దెందులూరు: జేఎన్‌టీయూ(కాకినాడ) సౌత్ సెంట్రల్ క్రికెట్ పోటీలు ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్టు హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఏఓ టీఎస్ కరుణానిధి, ప్రిన్సిపల్ రాధాకృష్ణ అన్నారు. శనివారం వేగవరం కళాశాలలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం సెమీ ఫైనల్ మ్యాచ్ జరిగిందన్నారు. ఐడియల్ కళాశాల- పీవీపీ సిద్ధార్థ కళాశాల మధ్య జరిగిన పోటీలో ఐడియల్ కళాశాల విజయం సాధించిందని తెలిపారు. ఫైనల్‌కు ఐడియల్ కళాశాల ఎంపికైందన్నారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల- లచ్చిరెడ్డి బాలిరెడ్డి కళాశాల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతుండగా వర్షం అధికంగా కురవడంతో నిలుపుదల చేశారు. ఆదివారం వర్షం, గ్రౌండ్ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఫైనల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి విన్నర్‌కు రూ. 50 వేలు, రన్నర్‌కు రూ. 25 వేలు షీల్డ్ అందజేస్తారని మేనేజింగ్ ట్రస్టీ సమీర్ తెలిపారు.



వేగవరం ఇంజనీరింగ్ కళాశాలలో సెమీఫైనల్ మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

ఉపసర్పంచ్ కుటుంబానికి సీఎం సహాయ నిధి



ఉపసర్పంచ్ రాగం కనకదుర్గ కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: కొత్తగూడెం ఉపసర్పంచ్ రాగం కనకదుర్గ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె వైద్యానికి అయ్యే ఖర్చులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరుకు సీఎంఓ కార్యాలయ అధికారులతో మాట్లాడారు. దీంతో రూ.2 లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన చెక్కును శనివారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కొత్తగూడెం ఉపసర్పంచ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ బొమ్మనబోయిన సుమలత, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత కనకరాజు, సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్ (సత్తిరాజు), వైఎస్సార్ సీపీ నాయకులు ఉదయ్‌భాస్కర్, గణేష్ తదితరులున్నారు.

కుటుంబ సభ్యులను కోల్పోవడం తీరని లోటు

పెదవేగి : కుటుంబంలో ఉన్న ఓ వ్యక్తిని కోల్పోవడం తీర్చలేని లోటని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం న్యాయంపల్లికి చెందిన దేవరపల్లి రవికుమారుడు గగన్‌తేజ(3) ఇటీవల మరుగుదొడ్డి కోసం తవ్విన నూతిలో పడి మృతి చెందిన విషయం విదితమే. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందించారు. అదే గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు సింగవరపు ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మరణించగా ఎమ్మెల్యే వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండల సచివాలయ కన్వీనర్ కేశన సతీష్, పెదవేగి సొసైటీ చైర్మన్ పెనుమాక వెంకట సుబ్బారావు, మండల నాయకులు మెట్లపల్లి సూరిబాబు పాల్గొన్నారు.

ఏసు మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏసు ప్రభువు చూపిన మార్గం సమాజంలో ప్రతి వ్యక్తికీ అదర్శమని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. బిషప్ జయరావు యాజక అభిషేక వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రగతి నగర్‌లోని అడోరేషన్ మొనస్ట్రీ ఆలయంలో దివ్య బలిపూజ సమర్పించారు. ఈ సందర్భంగా జయరావు సందేశమిస్తూ గురుత్వ జీవితపు పవిత్రతను, ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ సోదర భావంతో మసలుకోవాలని, తమ పరిసరాల్లోని పేదలను ఆదుకోవడానికి ఆపన్న హస్తం అందించిన వారు ప్రభువు సన్నిధికి చేరుకుంటారని చెప్పారు. నగరంలోని ఓ కాన్వెంట్‌లో కుట్టు విద్యను అభ్యసిస్తున్న పలువురు బాలికలకు కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు. 31వ గురుత్వ వార్షికోత్సవాన్ని ముగించుకుని 32వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన బిషప్ జయరావును ఫాదర్లు ఘనంగా సన్మానించారు. ఏలూరు మేత్రాసన కోశాధికారి ఫాదర్ రాజు బేదంపూడి, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ టి.ఇమ్మానియేలు, కథీడ్రల్ విచారణకర్త ఫాదర్ మైఖేల్ ఇంజమాల, డీపాల్ డెంటల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ఫాదర్ తోట అంతోని, ఫాదర్ ఇంజే పౌలు, ఫాదర్ అమ్మన రాజా, ఫాదర్ స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

గాలాయగూడెంలో హౌసింగ్ డే

దెందులూరు: జగనన్న కాలనీల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, హౌసింగ్ ఏఈ దివ్య కోరారు. శనివారం గాలాయగూడెం జగనన్న కాలనీ వద్ద సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు అధ్యక్షతన గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో హౌసింగ్ డే నిర్వహించారు. జగనన్న కాలనీల్లో గ్రామ పంచాయతీలకు సమాంతరంగా సకల సౌకర్యాలు కల్పించామన్నారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామస్థాయి ఉద్యోగులు, జగనన్న లబ్ధిదారులతో మాట్లాడి మరింత వేగవంతంగా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సౌంగా ప్రమీలా రాణి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట వెంకన్న, పెద్దిశెట్టి బసవయ్య, వీఆర్ఓ విష్ణు తదితరులున్నారు.



గాలాయగూడెంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ లక్ష్మి, హౌసింగ్ ఏఈ

కొవ్వలి ఆయకట్టుకు తీరిన సాగునీటి సమస్య

దెందులూరు: దెందులూరు ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీటి సమస్యల పరిష్కారమైంది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కృషి ఫలితంగా శనివారం సాగునీటి విడుదలకు మార్గం సుగమమైంది. కొవ్వలి, దెందులూరు, ఉండ్రాజవరం, ఆయకట్టులోని 500 ఎకరాలకు సాగునీరు స్వల్పంగా కొరత ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి విషయంపై దృష్టి సారించి జిల్లా అధికారులు, కలెక్టర్‌తో మాట్లాడారు. సాగునీటి విడుదలపై చర్చించారు. కలెక్టర్, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పీ.రామకృష్ణ శనివారం కొవ్వలి, ఉండ్రాజవరం, దెందులూరు, పాలగూడెం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించి రైతులతో ఆయన మాట్లాడారు. సాగునీరు పొలాలకు ఇబ్బంది లేకుండా సరఫరా అవుతుందని రైతులు ఆందోళన చెందనవసరం లేదని భరోసా ఇచ్చారు. ఆయన వెంట అసిస్టెంట్ డైరెక్టర్ కే.సుబ్బారావు, దెందులూరు ఏఓ గద్దె రమేష్, ఆర్‌బీకే సిబ్బంది ఉన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పీ.రామకృష్ణ

పూళ్ల, ఎంఎంపురంలో ఆక్రమణలను తొలగిస్తాం

భీమడోలు: పూళ్ల నుంచి ఎంఎంపురం వరకు రోడ్డు వెంబడి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని, లేని పక్షంలో వాటిని తొలగించి సంబంధిత వ్యక్తుల నుంచి ఖర్చులు వసూలు చేస్తామని పూళ్లలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఆక్రమణలను రెవెన్యూ, పోలీసుల సమక్షంలో తొలగిస్తామని తీర్మానించారు. పూళ్లలో గ్రామ సభ సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. గ్రామకార్యదర్శి ఎస్.సూర్యకుమార్ ఉత్తర్వులను వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు హైకోర్టు ఆదేశాల మేరకు పూళ్ల నుంచి ఎంఎంపురం వరకు ఆక్రమణలను తొలగించాల్సి ఉందన్నారు. ఎంఎంపురంలోని అముజాల కిశోర్ నిర్మాణంలో ఉన్న భవనం వద్ద బడ్డీ కొట్టు నిర్మించారు. అదే గ్రామానికి చెందిన పడవల గోపి బడ్డీ కొట్టును తొలగించాలని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసాడు. దీనితో అముజాల కిషోర్ పూళ్ల నుంచి ఎంఎంపురం గ్రామాలకు మధ్య ఆక్రమణలున్నాయని, వాటన్నింటినీ తొలగించాలని హైకోర్టులో పిటిషన్ వేసారు. దీనితో హైకోర్టు ఆదేశాల మేరకు పూళ్ల, ఎంఎంపురం జంట గ్రామాల మధ్య ఉన్న ఆక్రమణదారులను, ఆక్రమణను తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఆక్రమణదారులంతా స్థలాలను వదిలి వెళ్లాలని, లేని పక్షంలో పోలీస్, రెవెన్యూ సమక్షంలో వాటిని తొలగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్దిరెడ్డి హరిబ్రహ్మానాయుడు, గ్రామ కార్యదర్శి ఎస్.సూర్యకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'పది' పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన

పెదవేగి : మండలంలో పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా జిల్లా విద్యాశాఖ ఎంపిక చేసిన మూడు పాఠశాలలను పెదవేగి తహసీల్దార్ ఎస్ నాగరాజు, ఎంపీడీఓ రాజ్‌మనోజ్, ఎస్సై లక్ష్మణ్ పరిశీలించారు. పెదవేగి, విజయరాయి, రాయన్నపాలెం, కూచింపూడి, వంగూరు జెడ్పీ హైస్కూల్‌ను పెదవేగి మండల అధికారులు సందర్శించారు. పాఠశాలల ఉపాధ్యాయులతో పరీక్షల ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు బాగా రాయాలని విద్యార్థులను అధికారులు ఆశీర్వదించారు.

పది పరీక్షలు పగడ్బందీగా నిర్వహణ

భీమడోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని భీమడోలు ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్ అన్నారు. భీమడోలులో జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ చేసారు. అక్కడ మౌలిక వసతులపై చీఫ్ సూపరింటెండెంట్ టి.పుష్పావతి నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈనెల 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కేవలం ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయన్నారు. మండలంలోని గుండుగొలను పరీక్షా కేంద్రంలో 240 మంది, భీమడోలులో 340 మంది, పోలసానిపల్లి గురుకుల కళాశాలలో 240 మంది, పూళ్లలో 200, ఆగడాలలంకలో 200 మంది పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. 51 మంది ఇన్విజిలేటర్లను నియమించారన్నారు. ఈ కార్యక్రమంలో డీవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ఉంగుటూరు : కాగుపాడు హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు సభ్యులు పరీక్ష సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శీతాల సత్యనారయణ, కార్యదర్శి అడపాశోభారాణి, కోశాధికారి పాండురంగరావు,హెచ్ఎం ఉమాదేవి పాల్గొన్నారు.

పేద విద్యార్థికి మానవత ఆర్థిక సాయం

పెదపాడు: అప్పనవీడు మానవత శాఖ పేద విద్యార్థికి రూ.15వేల ఆర్థిసాయం అందించినట్లు ఆశాఖ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు తెలిపారు. విట్ యూనివర్సిటీలో బీబీఏ 3వ సంవత్సరం చదువుకుంటున్న హనుమాన్ జంక్షన్‌కు చెందిన దండమూడి శ్రీధర్ కుమారుడు హస్వంత్ చౌదరికి శనివారం కళాశాల ఫీజు నిమిత్తం కోటేశ్వరరావు చేతుల మీదుగా సాయం అందించారు. అప్పనవీడు మానవత శాఖ సభ్యులు వేగిరెడ్డి సూర్యనారాయణ, ఘంట సత్యనారాయణ పాల్గొన్నారు.

'వైఎస్సార్ కంటి వెలుగు' వృద్ధులకు వరం

గణపవరం: కంటికి సంబంధించిన సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, పి. కిరణ్మయి అన్నారు. శనివారం గణపవరం మండలం వల్లూరు గ్రామ సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలకు కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి ఆరోగ్యానికి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం తదితర అంశాలు వివరించారు. ఈ సందర్భంగా 60 మందికి కంటి పరీక్షలు చేసి వారందరికీ కళ్లజోళ్లు అవసరమని గుర్తించామని ఆప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆకుపచ్చని కూరలు తినాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని అన్నారు.



వల్లూరులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రామాలయం వద్ద అన్నదానం

పెదపాడు: స్థానిక తెలగాలపేట రామాలయం వద్ద శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మూడు రోజులు పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో శ్రీరామనవమి పురస్కరించుకుని భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ అన్నదానం కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, కొత్తూరు విమలారావు పాల్గొన్నారు.